కథానిక:

చీకటి షువ్వులు

శ్రీ వల్లమన్నాటి రామచంద్రరావు

కాలకాంత ప్రసవవేదన పడుతోంది....జగత్తు క్షణ విరీక్షణలో నిమగ్నమై యున్నది. ముహూర్త మాసన్నమయింది. రాత్రికి పురుడు పోశారు. బార సాలకి కాబోలు పక్షిసంతతులు విందుకి గూడు చేరుకుంటున్నాయ్. చీకటి దాయి రాత్రికి చిచ్చికొట్తోంది. రాత్రి మనసు దాయి కేం తెలుసు? మధ్యమధ్య ఉలిక్కిపడుతోంది. చీకటి వీపుతట్టింది. పసిపాప 'కెవ్వు'మన్నది.

అది బయలుప్రదేశం. ఆ ప్రక్కన చింత తోపు. పండిరాలిన ఆకులతో భూమి కప్పబడింది. వెన్నెల వెలుతురుకు భయపడి చీకటి ఆ తోపులో గూడుకట్టుకుంది. పాపం, వెరచే వస్తువు గడ్డిపోచ కన్నా తేలిక! క్రిమికీటకాదులుకూడ అల్పంగా తృణీకరిస్తాయి. దైన్యంగా పక్కకి ఒదిగి ఉండక గత్యంతరం? పిల్లికి చెలగాటం, ఎలుకకి ప్రాణసంకటం! గాలికి పరిహాసం! చీకటికి భయం! అలా నవ్వుతూ వెంటాడుతుంది. చింతరెమ్మల గుబురును వెదం చేస్తుంది. వెలుగు అదను కనిపెట్టి వైరిని మూల మూలలా వెదకుతుంది. పిచ్చిది! చీకటి అమాయకపుది పాపం! దానిచెరగులో వాసంచేయడానికి వెతకే వారివి విడిచి పారిపోతుంది. 'అబ్బ! ఏమిటి? యింత రాత్రివేళ' అంటూ విసుగుతో కసురుకున్నాయా రాలిన పండుటాకులు. "దయయుంచు తల్లీ" అని వేడుకుంటూ వాటినిద్రకి భంగం కలుగకుండా దారి వెతుకుతూ నడిచివెళ్లింది, ఓపాద ద్వయం.

*   *   *

గాయం తగిలిన హృదయం చీకటి కోణంలోకి ఒదిగితే మానదు. ప్రతిజీవి దానివంకే ఆశ్చర్యంగా చూస్తాడు. దృష్టిదోషం తగిలి మరింత బాధ పడుతుంది. గాయం మానినా మచ్చపోదు. బాధకి జాలి కలిగి నిస్పృహచెందిన జీవిని నిద్ర ఒడిలో జో కొట్టుంది. అమాయకపు జీవుల ఆర్తనాదాలు విని చిలిపినవ్వు నవ్వుతుంది. అలా అర్థంలేని బాధకైనా దయకద్దు. కాని కటిక హృదయానికి కనికర మేమిటి? అసహ్యమైనా "అయ్యో" అంటుంది. "అజ్ఞ", "అధికారం" అంటూ దర్పంతో రెంటినీ పేనుతూ పసి గొంతుకకి ఉరితాడు పోసేవారికి జాలి పరదేశి. అంటరానిది. నిర్దయ అలా వెంటాడి తరుముతుంది.

*   *   *

, రాత్రియంతా అలా భయపడుతూ బంకుగా శూన్య దృష్టితో ఆకాశం వంక చూస్తూ కాలయముని బాధ తప్పుకునేందుకు నిద్ర ఒడిలో ధ్యానం చేసింది ఓ కన్నులజంట. నిద్ర పకాపకా నవ్వింది. ఆ నవ్వుకి విశ్వమంతా మారుమ్రోగింది. ఆ జీవి వాలకం చూస్తే భయానికి భయమేస్తుంది. బరువైన కను రెప్పలలో భయం, విషాదం దాక్కున్నాయ్. నిస్పృహో, కళావిహీనతా, తొంగి, దోబూచులాడుతున్నాయ్ ఆచక్షువులతో. ఆప్యాయంగా కౌగలించుకున్నాయ్ ఆ వదన సీమను. ఆ స్నేహితులు అనిర్వచనీయమైన బాంధవ్యముతో ఆవరించుకొని యున్నా ఆ శరీరం అప్పుడప్పుడు వణుకుతుంది. ఉలిక్కిపడుతుంది, "ఖర్మానికి కాళ్లులేవు" అంటూ కలవరించాడు. ప్రపంచంలో వాత్సల్యానికి, దయకి, బాంధవ్యానికి అతను దూరుడయ్యాడు. దురదృష్టదేవత పొత్తిళ్ళలో గారాబంగా పెరిగాడు. ఆ పసి హృదయం అలా ఒంటరిగా విడనాడబడింది.

*   *   *

ఆ రోజు ఉదయం.

'అమ్మా అన్నమే' అని నోరు తెరచుకు అడిగాడు.

తల్లి గుడ్లలో నీరు కుక్కుకొని 'నాన్నరానీ' అంది.

వీథిలో మరమరాల అమ్మి కేకవేసింది.

'ఏమిటవి?' అని నీరసంగా అడిగాడు తల్లిని.

తల్లి దీనంగా ఆ పసికూనవంక చూచి వినిపించుకోనట్టుగా "నాన్నా, మంచినీళ్లు తాగు పాపం. దాహం వేసినట్టుంది' అని తల నిమిరింది.

'అమ్మ........ఆకలే అన్నం పెట్టవా' అని తల పైకెత్తి తల్లి కళ్ళలోకి చూ చాడుజాలిగా

'పెట్టా....నాన్న రావద్దూ?....' అని వీథిగుమ్మంకేసి చూచింది.

"ఇప్పుడే....రాడే" అంటూ తల్లి నడుం కావిలేసుకొని మారాము చేశాడు.

తల్లి తనచేతులతో వీపు నవరించింది. ఏంచేస్తుంది అంతకన్నా? పేదరికానికి ఓదార్పు లాభంలేదు. అవస్థ పడేవాళ్ళని మాటలతో నచ్చచెప్పాలని ప్రయత్నము చేస్తే నిష్ఫలం. ఆ విచారం ప్రపంచములో జాలి హృదయాల ఓదార్పులోని నిర్వీర్యతను నగ్నంగా బయటపడేస్తుంది. నిస్సహాయత విచార సాగరాన్ని ఉసికొల్పుతుంది.

అలా కెరటాలు కెరటాలుగా లేచి కనురెప్ప తీరాన కొట్టుకుంటాయి. ఆ ప్రతి కన్నీటి బిందువు మానవ జీవిత చరిత్రలో ఒక్కపుటగా వెలుస్తుంది. ఆ బిందువు గర్భంలో ఎంతటి మూగ చరిత్ర దాక్కున్నది? ఆనాటి

హంపీలో ఉగ్రనరసింహస్వామి విగ్రహము. ఒక రాతిలో మలచబడినది.

ప్రపంచంలోని పరిస్థితు లందులో జీర్ణించియుంటాయి. కాని అర్థంచేసికొన్నేందుకు ఆ భాష, ఆ పరిజ్ఞానం వేరు కాబోలు. కాకపోతే అవి అలా ఎందుకు అగాధమైన అర్థం కాని చేష్టలుగా ప్రతిక్రియారహితమై అంతరించి పోతాయి?

తల్లి లోపలపని చూచుకోటానికి వెళ్ళింది. ప్రక్కయింటవారికి పిండి విసరి పట్టుకువెళ్తోంది. అదను చూచి ఆకలి తీర్చుకోడానికి ఆ పసిచేతులు వణుకుతూ తండ్రి చొక్కా దగ్గరకి వెళ్ళాయి....

తల్లి తిరిగి వచ్చింది....అబ్బాయి మూలకి నక్కి తింటున్నాడు. నిర్ఘాంతపోయాడు.

కాని ఆకలి 'తిను, తిను' అని ప్రోత్సహించింది. పని ఆపలేదు. "మిఠాయి ఎక్కడిది?" అని అడిగింది ఆశ్చర్యంగా తల్లి. అదుర్దాతో సమాధానం కోసం ఎదురు చూచింది. కాని చిలిపిగా నవ్వి అందకుండా తప్పించుకొని పరి గెత్తాడు—మరో క్షణంలో?

"వెధవా అంట్ల వెధవ" అంటూ తండ్రి, చేతిలో కర్రతో ఆ లేత వీపుమీద నాట్యం చేయిస్తున్నాడు కాలికి బండకొయ్య తగిలించాడు. నగ్నంగా వాకిట్లోకి త్రోసి, నిలబెట్టి తన్నుతున్నాడు. "నాన్నా".... "అమ్మో" "నాన్నోయ్" అంటూ హృదయం దహించుక పోయేటట్టుగా "కెవ్వు" మని కేక వేస్తున్నాడు. తల్లి, భర్త శాసనానికి గజగజ లాడింది. ధిక్కరించే సాహసం లేకపోయింది. "అమ్మా...." అని కేకపెట్టాడు. కాని లాభం? 'అబ్బా!' అని కొంగుతో కళ్ళు కప్పుకొని లోపలికి వెళ్ళింది....

ఆ మండు టెండలో కర్కశహృదయంతో గుంజీలు తీయించాడు.

"ఏం నాన్న మాట వినకూడదూ?"

"పొగరుబోతు వెధవ కాబోలు"

"గాడిదలా ఉండి తప్పుచేసాడు కాబోలు...."

"తప్పులు చెయ్యడందేనికి? తన్నులు తీపిగా ఉన్నాయా?" అని తలో మాట అన్నది ప్రపంచం. లోకులకేం తెలుసు? చూచినది నమ్మేది.

*   *   *

తండ్రికి కొడుకు చేసిన పని క్షమారహితంగా తోచింది. కొడుకు, చుట్టకు మిగుల్చుకొన్న అణా డబ్బుతో మిఠాయి కొనుక్కున్నాడు.

తండ్రికి దగ్గుబాధ. చుట్టకావాలి. ఆర్జించినది బొటాబొటిగా తిండికే సరిపోదు. మరి మందుకు ఎక్కడ నుంచి తేగలడు? పేద ప్రపంచానికి సుకుమారత దేనికి? కొడుకుకి ఆకలి. మరి గత్యంతరం? * *

ఆ పూట చేసిన తప్పుకింద భోజనం జమకట్టబడింది. వడ్డీకింద బడితపూజ. అలా అరుగుమీద పడుకుని ఏడ్పు దిగమ్రింగి ఊరుకున్నాడు. వీపుమీద వాతలు తేలినాయ్. ప్రతిదెబ్బకి సాక్షిభూతంగా వాత. కాని, మనస్సు సంక్షోభం చెంది ప్రతివాత ఎట్టి ముద్ర వేసినదో ఎవరికి అవసరం?

తను మిఠాయికి 'దొంగతనం' చేసాడు. తండ్రికి బాధ కలిగింది. బాధకి ప్రతికారంగా పసి హృదయానికి సంతాపం కలుగచేశాడు....జఠరాగ్ని కన్నా అవమానాగ్ని దహించివేస్తుంది యావత్‌మనిషినీ....

*   *   *

ఆ రోజు విసిగి వేసారిన జీవిలా నిస్సారంచు నీరసంగా ఉదయానికి స్వస్తివాచకం చెప్పింది. సాయంకాలం తప్పుచేసిన దానిలా బెరకుబెరకుగా 'బిక్కు' మంటూ దిగాలుబడి వచ్చింది ప్రపంచంలోకి....

*   *   *

"డాయ్.... ఎవరది.... పట్టుకో...."అని కేక.... పక్కకి నక్కాడు భయంతో....భయకంపిత హస్తాలతో దబదబా మింగుతున్నాడు.. తడుముకుంటూ ఓ వ్యక్తి చూచాడు దృశ్యం. తండ్రి కొట్టిన దెబ్బలు స్ఫురణకు వచ్చాయి.... ఉ!....ఉ!...." అని మూలిగాడు. 'అమ్మో ,'అంటూ దీపంకింద పడేసి పెద్ద పెటున అరిచాడు.. ధణేలుమని కర్రపెడు చప్పిడి కొట్టుచుటూ జనం మూగారు. 'ఎవరు' 'ఎవరు...'అంటూ గిజగిజ లాడుతున్నారు. "ఏమిటి" "ఏమిటి" అంటూ తోసుకు ముందుకు వచ్చిన మూకజనం.. భయోత్పాతంగా కొట్టంతా నెత్తురు చిమ్మింది.

"ఆబ్బో ...వాడు....దొంగ.... మిఠాయి తింటున్నాడు. పట్టుకోపోతే కొట్టి పారిపోయాడు...."అంటూ శెట్టి మరణ వాజ్మాలం...."దొంగని పట్టుకోండి...." అంటూ పెద్దపెట్టున కేక. కేకల సందడిలో ఓ వ్యక్తి దూసుకు పారిపోయాడు. జనం వెంబడించారు. "అమ్మో....ఉ..(ఉ...." అంటూ వణికినాయ్ ఆ పెదిమలు... "నా కోసమే....ఏమిటి?...." అంటూ అమాయికంగా ఏడ్చాడు కలలో ఉలిక్కిపడి లేచి వీపు చరచుకున్నాడు."అబ్బా! .. భయం వేస్తోంది.. నిజంగానా" అని నాలుగు దిక్కులా చూచాడు.... "అరుగో....అరుగో....నా కోసం" .... ఆ దీపం. .. ఏమిటి?" అంటూ వెకిలిగా నవ్వాడు.... ఆ నవ్వుకి చీకటి గజగజ వణికింది....నిశ్శబ్దం త్రుళ్ళిపడ్డది— మిణుకుమిణుకుమంటూ దీపం ఆ రహస్య ప్రదేశంలోని చీకటిని చీల్చి వెతకుతోంది.... "అబ్బాయి" అన్న కేక స్థంభీభూతమైన గాలిని చెరపివేసింది. పిలిచినగొంతుక దగ్గరకు వచ్చింది... కాని 'అబ్బాయి, కదలలేదు. పారిపోవటానికి ప్రయత్నించలేదు అలా కొయ్యబారి శిలావిగహంలా నిలబడ్డాడు.

దీపం దగ్గరకు వచ్చింది. ఆ వెలుగులో కళ్లు చింతనిప్పులలా మెరుస్తున్నాయ్.... "ఆ.... కర్ర . అదిగో..." అంటూ వణికాడు.. "కొట్టను.... నాన్నా..."అన్నాడు తండ్రి. "అబ్బాయి...." అంటూ దగ్గరకు వచ్చింది తల్లి. "అమ్మ...." అంటూ ఆ చిరు పెదవులమీద తుదిసారి నాట్యం చేసినాయ్. "అమ్మ... అమ్మ...." అంటూ ఆ రెమ్మలు ఆ వదానికి ఆహ్వానం చేసినాయ్. అలా కరిగిపోయిన కలలా కిందకి కూలాడు........

సాయంకాలం ఎవ్వరూ లేనప్పుడు అలా అందరినీ వదలివచ్చిన బిడ్డకోసం వెతుకుతూవచ్చిన తల్లికి ఎంత ఆనందం! అందుకోడానికి కాబోలు చేతులు జాచింది.

"అబ్బాయి...." అని ఆప్యాయంగా పిలచింది. అలా భర్త కేసి చూచింది. మౌనంతో తలదించుకున్నాడు.

'అబ్బాయి' తల నిమిరింది తల్లి... ఎత్తుకొని హృదయానికి హత్తుకుంది.

అమాయికపు జీవిని భోజనంగా స్వీకరించి తేన్చింది మృత్యువు.

రాత్రి కలత నిద్రలో లేచింది...."కెవ్వుమన్నది". పరిచిన వెన్నెల ముడుతలు పడింది. తన వార్ధక్యాన్ని అర్థంచేసికొని ఓ పక్కకి ఒదిగింది. తప్పు చేసిన దానిలా వెలావెలా పోయింది. అలా చీకటి అంచుల్లో నలిగి వాడిపోయింది ఆ జీవితకుసుమం. వాడిన ఆ పువ్వును చూచి తలవంచుకున్నది ఆ ముహూర్తం రాత్రి కట్టుకున్న వెన్నెల మానిపోయింది. ఆ తోటలో చీకటి నలుపుకి....రాత్రికి బాటకట్టారు....పక్షిసంతతి.

యావద్ ప్రపంచానికి వేకువసమయం. వెలుగును ఆహ్వానించటానికి పక్షులు తియ్యటి స్వరాలతో ఆహ్వానగీతులు పాడుతున్నాయ్. అలా సంగీతపు టంచులు చెరిగిపోకమునుపే అనంతసీమ పథాల్లోకి విహరించబోయింది ఆ జీవి.